సీఎంను కలిసిన రజక జేఏసీ నాయకులు



జాబితా అందజేస్తున్న రజక జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆంజనేయులు

మేడ్చల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన రాష్ట్ర రజక జేఏసీ ఎన్నికలలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో ప్రచారం చేసే రజక నాయకుల జాబితాను సీఎం రేవంత్ రెడ్డికి తెలియజేశారు. రజక జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పంజుగారి ఆంజనేయులు రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి నాయకుల జాబితాను అందజేశారు. రజక జేఏసీ తరఫున కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయాలని ఆయన రజక నాయకులను కోరారు.

వేగంగా.. హియర్‌జాప్ విస్తరణ

సాక్షి, సిటీబ్యూరో: వినికిడి సమస్యల పరిష్కార పరికరాల తయారీకి పేరొందిన హియర్‌జాప్.. తమ 110వ స్టోర్‌ను నగరంలో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ఎండీ, ఆడియాలజిస్ట్ ఎస్.రాజా మాట్లాడుతూ 50ఏళ్ల తమ ప్రస్థానంలో వినికిడి శక్తిని పెంపొందించడం కోసం కృషి చేస్తున్నామని, ఇది తమ 100వ స్టోర్ కాగా దేశవ్యాప్తంగా 500 స్టోర్స్ నెలకొల్పే దిశగా సాగుతున్నామని వివరించారు.

పారిశుద్ధ్య కార్మికుడికి నివాళి



ఘట్‌కేసర్: ఎదులాబాద్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు జవాదీ సత్తయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు యాదయ్య, మండల కార్యదర్శి సబిత మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లేశ్, భిక్షపతి, సుధాకర్, వేణు, శివ, శ్రీను, సత్తమ్మ, లక్ష్మమ్మ, కౌసల్య, చంద్రమ్మ, సుజాత, కమలమ్మ, శ్రావణి, జ్యోతి, జంగమ్మ, రాధా, భవాని, సురేశ్ పాల్గొన్నారు.

కబేళాకు ఆవులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు



ఘట్‌కేసర్: పశువులను కబేళాకు తరలిస్తున్న వాహనాన్ని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సభావత్ విజయ్‌కుమార్ అనే వ్యక్తి మంగళవారం విజయవాడ సంతలో 44 ఆవులు, 36 ఎద్దులు(మొత్తం 80) కొనుగోలు చేసి కంటైనర్‌లో క్రూరంగా నిర్బంధించి తాళ్లతో కట్టివేసి బహదూర్‌పుర కబేళాలకు తరలిస్తుండగా ఘట్‌కేసర్ వద్ద బుధవారం పట్టుకున్నారు. అందులో అప్పటికే ఒక ఆవు మృతి చెంది ఉంది. డ్రైవర్ షమీ మహ్మద్, లేబర్ గంగరాజును అదుపులోకి తీసుకొని పశువులను జియాగూడలోని గోశాలకు పంపించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ఘట్‌కేసర్: 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో తనిఖీలు చేపట్టగా యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం, మల్కాపురం గ్రామానికి బుక్య రాజేందర్ అశోక్ లీలాండ్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా స్థానికంగా తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు పరిసర ప్రాంతాల్లో ఇటుక కబట్టీలో పనిచేసే కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ మృతదేహం లభ్యం



మేడ్చల్‌రూరల్: అనుమానస్పద స్థితిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి రైల్వే కాలనీ పరిధిలోని అలెక్యా అవెన్యూ వెంచర్‌లో కుళ్లిపోయిన స్థితిలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు ఘటన స్థలిలో పలు ఆధారాలు సేకరించారు. మృతదేహానికి సమీపంలో మహిళ చెప్పులు లభ్యమయ్యాయి. మేడ్చల్ పట్టణం- డబిల్‌పూర్ గ్రామాల మధ్య వెంచర్ ఉండటంతో మహిళను హత్య చేసి పడేసి వెళ్లారా..? లేక మహిళపై లైంగికదాడికి పాల్పడి హత్య చేసి ఉంటారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతురాలి వయస్సు 40-45 మధ్య ఉంటుందని, అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

నకిలీ వైద్యుడిపై కేసు నమోదు

పోచారం: అర్హత లేకుండా వైద్యం చేస్తున్న వ్యక్తిపై పోచారం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రెములలో ఆర్‌ఆర్ క్లినిక్‌ను రవీందర్‌రెడ్డి నడిపిస్తున్నాడు. ఇతను ఎంబీబీఎస్ వంటి వైద్య కోర్సులు చేయకుండానే డాక్టర్ రవీందర్‌రెడ్డి అని పేరు పెట్టుకొని వైద్య సేవలు అందిస్తున్నాడు. అర్హత లేకుండా రోగులకు అల్లోపతి మందుల చీటీలు రాస్తూ, ఇంజక్షన్లు, ఐవీ ఫ్లూయిడ్ ఇస్తున్నట్లు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా.సీహెచ్.హనుమంతరావు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రవీందర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

మెడికల్ షాపు నిర్వాహకుడిపై కేసు

పోచారం: లైసెన్స్ లేకుండా మందుల షాపును నడిపించడమే కాకుండా అర్హత లేకుండా వైద్య సేవలు అందిస్తున్న వ్యక్తిపై పోచారం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రెములలోని నరేంద్ర మెడికల్ షాపును తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డా.సీహెచ్ హనుమంతరావు తనిఖీ చేసి లైసెన్స్ లేనట్లు గుర్తించారు. దానితో పాటు డీబీఎం క్లినిక్‌ను కూడా నరేందర్ నిర్వహిస్తున్నాడు. అర్హత లేకుండానే డాక్టర్ నరేందర్ అని పేరు పెట్టుకొని వైద్య సేవలు చేస్తున్న వ్యవహారం బయటపడింది. దీంతో నరేందర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

కమనీయం.. రాములోరి కల్యాణం



చౌదరిగూడలో శ్రీసీతారాములు కల్యాణ వేడుకలు



వారెడ్డిగూడలో శ్రీసీతారాముల కల్యాణం



డబీల్‌పూర్‌లో సీతారాముల ఊరేగింపు



ఘనాపూర్‌లో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మహేశ్‌గౌడ్

శ్రీరామనవమి ఉత్సవాలు బుధవారం మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో అంగరంగ వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. జైశ్రీరామ్ నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పలు కాలనీలు, బస్తీల్లోనూ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఘట్టాన్ని కాలనీవాసులు కనులారా వీక్షించారు. ఆలయాల వద్ద మధ్యాహ్నం తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. యువత కాషాయ జెండాలతో రామనామాన్ని స్మరిస్తూ భారీ ఊరేగింపులు నిర్వహించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. – మేడ్చల్ జోన్ బృందం



రామనవమి వేడుకల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి



పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లో స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకెళ్తున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు



యంనంపేట్‌లోని రంగనాయకస్వామి ఆలయంలో వేడుకగా నిర్వహిస్తున్న శ్రీసీతారాముల కల్యాణం



జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డి, పార్టీ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అంబేడ్కర్‌నగర్ ఆర్యవైశ్య సంఘంలో శ్రీసీతారాముల కల్యాణం



కల్యాణం వీక్షిస్తున్న భక్తులు



మేడ్చల్‌లో సీతారాములను తీసుకెళ్తున్న నిర్వాహకులు



కీసరగుట్టలో సీతారాముల కల్యాణోత్సవం



మేడ్చల్‌లో హనుమాన్ భక్తుల ర్యాలీ



పూడూర్‌లో ఈటల రాజేందర్, నాయకులు



కీసరలో పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు



గుండ్లపోచంపల్లిలో..



కండ్లకోయలో రాములోరి కల్యాణంలో భక్తులు



చీర్యాలలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ

వాటర్ ప్లాన్ రెడీ



ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా..

- 13 పురపాలక సంఘాలు, 61 గ్రామాల్లో చర్యలు
- ప్రతి మూడు డివిజన్లు/ వార్డులకు ఒక ట్యాంకర్
- ప్రతి గ్రామంలో అదనంగా రెండు ట్యాంకర్లు
- అవసరమైతే అద్దెకు వ్యవసాయ బోర్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారుల్లోని 13 పురపాలక సంఘాలు, 61 గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించిన అధికార యంత్రాంగం అమలుకు చర్యలు తీసుకుంటోంది. ఓఆర్‌ఆర్(లోపలి) పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి జలమండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా, వీటితో సహా మిగతా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో జిల్లా అధికార యంత్రాంగం యాక్షన్ ప్లాన్‌తో ముందుకెళ్తోంది.

నీటి ఎద్దడిని నివారించేందుకు..

నగర శివారులోని జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట నగరపాలక సంస్థలతో పాటు కొంపల్లి, మేడ్చల్, దుండిగల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల పరిధిలోని మూడు డివిజన్లు/వార్డులకు ఒక వాటర్ ట్యాంకర్‌ను కేటాయించటంతో పాటు నీటి ఎద్దడి నివారణకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అవసరాన్ని బట్టి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లు కూడా అందుబాటులో ఉండేలా యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ప్రైవేట్ కమర్షియల్ బోర్లతో పాటు పెట్టణానికి సమీపంలో గుర్తించిన వ్యవసాయ బోర్లను కూడా ఉపయోగించేలా కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసింది.

మండుటెండల నేపథ్యంలో..

నీటి సరఫరా పర్యవేక్షణకు పురపాలక సంఘాల కమిషనర్లతో సహా ప్రతి మూడు డివిజన్లు/వార్డులకు ఒక ప్రత్యేక అధికారిని జిల్లా కలెక్టర్ గౌతమ్ నియమించారు. వీరంతా జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)అభిషేక్ అగస్త్య నేతృత్వంలో పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మండుటెండల నేపథ్యంలో పడిపోతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్టుమెంట్లలో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రైవేట్ కమర్షియల్ ట్యాంకర్లు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అధిక జనాభా కలిగి ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌తో సహా పురపాలక సంఘాల్లో నీటి సమస్య తలెత్తకూడదన్న లక్ష్యంతో యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

మండలానికో ప్రత్యేకాధికారి

నీటి సరఫరా పర్యవేక్షణ కోసం మండలానికో ప్రత్యేకాధికారిని కలెక్టర్ నియమించారు. శామీర్‌పేట మండలానికి ప్రత్యేక అధికారిగా డీపీఓ కొండా వెంకయ్యను నియమించగా, ఎంసీపల్లి మండలానికి డీపీఎల్‌ఓ వి.సాంబిరెడ్డి, మేడ్చల్ మండలానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ నీరజా, కీసర మండలానికి జెడ్పీ సీఈఓ ఎస్.దిలీప్‌కుమార్, ఘట్‌కేసర్ మండలానికి డీఆర్డీఏ ఎం.సాంబశివరావులను ప్రత్యేక ఆఫీసర్లుగా నియమించారు. కలెక్టర్ ఆదేశాలతో గేట్ వాల్స్, పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టడంతో పాటు తాగునీటి సరఫరా తదితర విషయాలపై ప్రతి మూడు రోజులకు ఒకసారి సంబంధిత శాఖలతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

పంచాయతీల్లో పకడ్బందీగా చర్యలు

నగర శివారుల్లో అర్బన్, సెమీఅర్బన్‌గా విస్తరిస్తున్న 61 గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలకు పూనుకుంటోంది. 61 పంచాయతీల్లో 160 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులతో పాటు 61 వాటర్ ట్యాంకర్లు ఉన్నప్పటికీ, ప్రతి గ్రామానికి అదనంగా రెండేసి చొప్పున వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచినట్లు డీపీఓ వెంకయ్య తెలిపారు. వచ్చే జూన్ వరకు నీటి ఎద్దడి నివారణకు ఏ, బీ, సీ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిన పంచాయతీ శాఖ అవసరాన్ని బట్టి అద్దెకు తీసుకునేందుకు 169 వ్యవసాయ బోర్లను గుర్తించింది. ఇందులో ఘట్‌కేసర్ మండలంలో 38 వ్యవసాయ బోర్లు, కీసరలో 12, ఎంసీపల్లిలో 32, శామీర్‌పేటలో 45, మేడ్చల్ మండలంలో 42 వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ బోర్లు ఉన్న భూములు సర్వే నంబర్లతో సహా రైతుల ఫోన్ నంబర్లు తదితర వివరాలను జిల్లా పంచాయతీ శాఖ సేకరించింది.

గౌడవెల్లిలో 'కోడ్' ఎక్కడ..?





గౌడవెల్లిలో వాల్‌పోస్టర్లు, కమలం గుర్తులు

మేడ్చల్: దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నా మండలంలోని గౌడవెల్లి గ్రామంలో కోడ్ మాత్రం కనిపించడం లేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసే విధంగా పార్టీల గుర్తులు, పార్టీల పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లు ఉండవద్దని నిబంధనలు ఉన్నా గౌడవెల్లి గ్రామంలో అవేవీ కనిపించడం లేదు. గ్రామంలో గోడలపై బీజేపీకి చెందిన కమలం పువ్వు గుర్తులు కనిపిస్తున్నాయి. వాల్ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. గ్రామంలో కార్యదర్శి ప్రత్యేకాధికారి ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో నివసిస్తున్న దివ్యాంగులు రాము, కృష్ణ, నరసింహకు మున్సిపల్ కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేతరాజు యువనాయకుడు కావడి రాజేష్ ఆధ్వర్యంలో మూడు చక్రాల వాహనాలను అందజేశారు. దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరిగౌడ్, సంతోష్ గౌడ్, పోతరాజు రాములు, దిలీప్, గుజ్జుక నర్మదపరుశురాం, శ్రీనివాస్, షాలోమి, సుశీల, తదితరులు పాల్గొన్నారు.